# పులి మడుగు



## మధుబాబు

# పులి మడుగు

రచన

మధుబాబు

© Author

© Madhu Baabu

This digital book is published by -

కినిగె డిజిటల్ టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటెడ్.

సర్వ హక్కులూ రక్షించబడ్డాయి.

All rights reserved.

No part of this publication may be reproduced, stored in a retrieval system or transmitted in any form or by any means electronic, mechanical, photocopying, recording or otherwise, without the prior written permission of the author. Violators risk criminal prosecution, imprisonment and or severe penalties.

# పులి మడుగు

ఖతం అయిపోయాడు ఖాదర్ పాషా.

చిన్నతనంలో ఏదో వాతం వచ్చి అవిటిదైపోయిన ఎడమ కాలిని ఎగరేసుకుంటూ, ఎప్పుడు చూసినా పారలవంటి ముందు పళ్ళు చిగుళ్లతో సహా కనిపించేలా నవ్వుతూ, చలకీగా తిరుగుతూ వుండే ఖాదర్ పాషా హతమారిపోయాడు అన్యాయంగా.

జానెడంటే జానెడు పొడుగుండే రాంపురి పేష్కప్‌తో ఎడాపెడా పొడిచినట్లు స్పష్టంగా కనిపిస్తున్నాయి అతని ఒంటి మీది గాయలు. ఎర్రటి నెత్తుటితో తడిసి అసహ్యంగా అగుపిస్తున్నాయి దుస్తులు.

"పాత సినిమా హాలు వెనుక భాగంలో వుండే చెత్తకుండీల మధ్య పడివున్నాడు ఇన్స్‌పెక్టర్ సాబ్! అతను ప్రతిరోజు ప్రార్థన కోసం పోయివచ్చే వలీబాబా దర్గా అక్కడికి అరఫర్లాంగు దూరంలోనే వుంది!!"

ఎగుసుకువస్తున్న ఆయాసాన్ని అణుచుకోవడానికి విపరీతమైన ప్రయత్నం చేస్తూ వినిపించాడు పడుతూ లేస్తూ ఆ వార్తను మోసుకువచ్చిన కానిస్టేబుల్.

పాంటు జేబులో నుంచి సిగరెట్ పాకెట్‌ని తీసి సిగరెట్ వెలిగించుకుంటూ గాఢంగా నిట్టూర్చాడు సబ్ ఇన్స్‌పెక్టర్ శర్మ.

సామాన్యుడు కాదు కానిస్టేబిల్ చెపుతున్న ఆ ఖాదర్ పాషా!

సిటీ మొత్తాన్ని ఏకఛత్రాధిపత్యంగా పరిపాలిస్తున్న క్రైమ్ కింగ్ రుస్తుం సాబ్‌కి రైట్ హేండ్ వంటి మనిషి!!

అటువంటి ఆప్తుడు అర్థాంతరంగా ఖతం అయిపోతే చేతులు ముడుచుకుని చూస్తూ కూర్చుంటాడా అతను ?

తన అనుచరులందర్నీ పోగు చేసి యుద్ధానికి సిద్ధం అవుతూ వుండడూ?

కాలుస్తున్న సిగరెట్ చేదుగా అనిపించి అసహ్యంగా నొసలు విరుస్తూ దాన్ని అవతల విసిరేశాడు శర్మ.

తన ఏరియాకు సంబంధించింది కాదు ఖాదర్ పాషా పడిపోయిన ప్రదేశం. తన ఏరియా కానప్పుడు అక్కడ ఏం జరిగినా, ఎటువంటి గొడవ ప్రారంభం అయినా ఖంగారుపడవల్సిన పనిలేదు తనకు.

ఆ మాట అనుకుంటుండగానే అతని కనులముందు మెదిలారు కత్తులు, కటార్లు, సైకిల్ చైన్లు పట్టుకొని చిందులు తొక్కే రుస్తుంసాట్ అనుచరులు. వాళ్ళు అరిచే అరుపులు కూడా చెవుల్లో ప్రతిధ్వనించిన ఫీలింగ్ కలిగేసరికి అర్జంటుగా మార్చేసుకున్నాడతను తన అభిప్రాయాన్ని.

"గెట్ మై వెహికల్... లెటజ్ గో టూ దట్ రెచ్‌డ్ ప్లేస్....." అని కానిస్టేబుల్‌కి ఆర్డరు యిస్తూ టేబిల్ మీది లాఠీ కర్రను అందుకున్నాడు.

క్షణం కూడా ఆలస్యం చేయలేదు ఆ కానిస్టేబుల్.

జారిపోతున్న పాంటు బెల్టును పైకి లాక్కుంటూ పోలీసు స్టేషన్ ప్రక్క భాగంలోకి పరిగెత్తాడు. అక్కడ ఒక చెట్టు నీడన పార్క్ చేసి వున్న బుల్లెట్‌ని తీసుకువచ్చి స్టేషన్ ముందు నిలబెట్టాడు.

చేతిలోని లాఠీని అతనికి అందించి, వెనుక కూర్చోమని సైగచేశాడు శర్మ. ఒకే ఒక కిక్‌తో బుల్లెట్‌ని స్టార్ట్ చేసి వేగంగా ముందుకు దూకించాడు.

టూ టవున్‌లో వుండే పాత సినిమాహాలు ఇంకో ఫర్లాంగు దూరం వున్నదనగానే చెవులకు చేరింది అతను ఎదురుచూస్తూన్న దారుణమైన రోదన. మరో వంద గజాల

దూరం కూడా పూర్తిగా పోకముందే కనిపించారు గుంపులు గుంపులుగా పోగవుతున్న రుస్తుం అనుచరులు.

"ఆగండి ఇన్స్‌పెక్టర్ సార్...ఆగండి . ముందుకు పోకండి....."

ఉన్నట్లుండి ఒక కీచు కంఠం తనను ఉద్దేశించి అరిచేసరికి సడన్ బ్రేకుతో బుల్లెట్‌ని ఆపాడు శర్మ.

రోడ్డుకు ఎడమ ప్రక్కన వున్న ఒక బడ్డీ కొట్టు చాటు నుంచి నాలుగు అంగల్లో అతని దగ్గిరికి వచ్చాడు టూ టవున్ స్టేషన్‌కి చెందిన కానిస్టేబుల్ ఒకతను.

"సినిమా హాలు దగ్గిర పరిస్థితి పరమ ఛండాలంగా వుంది. ఏ క్షణంలో నైనా వయొలెన్స్ స్టార్ట్ కావచ్చని అనుకుంటున్నారు. రీయన్‌ఫోర్స్‌మెంట్స్ వచ్చేదాకా అటుకేసి వెళ్లవద్దని, అనవసరంగా వాళ్ళందర్ని రెచ్చగొట్టవద్దని సూపరింటెండెంట్ గారి ఆర్డర్స్...."!

హడావుడిగా శాల్యూట్ చేస్తూ చెప్పాడతను. చెప్పిన వెంటనే ఎంత వేగంగా వచ్చాడో అంతే వేగంతో తన స్థానంలోకి వెళ్ళిపోయాడు.

అతను చెప్పిన న్యూస్ శర్మ మనస్సును పూర్తిగా హత్తుకోక ముందే వున్నట్లుండి ఎక్స్‌ప్లోడ్ అయింది సినిమాహాలు వద్ద టెన్షన్‌తో నిండివున్న వాతావరణం.

ఫటా ఫట్... ఫటాఫట్ మని వికృత శబ్దాలు చేస్తూ బాంబులు మాదిరి బ్రద్దలవసాగాయి సోడా బాటిల్స్.

రివ్వు రివ్వున గాలిలోకి లేచి దుకాణాల ముందున్న షోకేసుల్ని, సైన్ బోర్డ్స్‌నీ ముక్కలు ముక్కలు చేయసాగాయి పెద్ద పెద్ద గులకరాళ్ళు.

గొంతులు చినిగిపోయేటట్లు అరుస్తూ కదిలారు రుస్తుం అనుచరులు. దారుణమైన విధ్వంసకాండను ఆరంభిస్తూ ముందుకు రాసాగారు.

చట్రాతి మీద కొట్టిన చిల్లపెంకుల మాదిరి చెల్లాచెదరయినారు వింత చూడటానికి ఆ ప్రదేశంలో గుమికూడిన సాదారణ ప్రజలు.

షోడా బాటిల్ ముక్కలు తగిలి, గులకరాళ్ళు మీదపడి అనుకోని విధంగా గాయపడ్డారు వారిలో చాలా మంది.

గావుకేకలు పెడుతూ సందుల్ని, గొందుల్ని వెతుక్కున్నారు వాళ్ళు. గాయపడిన అవయవాల్ని అదుముకుంటూ ఆ ప్రదేశానికి దూరంగా పారిపోయే ప్రయత్నాలు చేశారు.

అరుపులతో, ఆర్తనాదాలతో అంతకు ముందు కంటె పదింతలు ఎక్కువగా దద్దరిల్లిపోసాగిందా వీధి. రుస్తుం అనుచరుల పదఘట్టనలకు భూకంపం వచ్చినట్లు కంపించిపోసాగింది.

వెర్రి ఆవేశంతో వూగిపోతున్న ఆ గుంపుని చూసి ఖంగారుపడలేదు శర్మ. వెనుక కూర్చుని వున్న కానిస్టేబుల్ గుంపును లీడ్ చేస్తున్న ఒక వ్యక్తిని చూసి తన ధైర్యాన్ని కోల్పోయాడు.

"మనకు సంబంధించని ఏరియాలోకి వచ్చి తన్నులు తిన్నామని తెలిస్తే అందరూ నవ్వుతారు సార్... బండిని వెనక్కి తిప్పండి సార్..." కంఠంలోని వణుకును కప్పిపెట్టుకునే ప్రయత్నం కొంచెంగా కూడా చేయకుండా వేడుకున్నాడు.

నిమ్మకాయలు నిలబెట్టేటట్లున్న బుర్రమీసాల్ని ఎడమచేత్తో మెలిపెడుతూ, కుడిచేత్తో పెద్ద బాణాకర్రను పట్టుకొని భీమసేనుడి మాదిరి అడుగులు వేస్తున్న ఆ లీడర్‌ని పట్టి పట్టి చూస్తున్నాడు సబ్ ఇన్స్‌పెక్టర్ శర్మ.

రీయిన్‌ఫోర్స్‌మెంట్స్ వచ్చేదాకా అటుకేసి ఎవర్ని వెళ్ళొద్దని ఎస్. పి. గారు ఎందుకు అన్నారో అప్పుడు అర్థం అవుతోంది అతనికి.

చనిపోయిన ఖాదర్ పాషా క్రైమ్ కింగ్ రుస్తుంకి రైట్ హేండ్ వంటి వాడయితే - సాక్షాత్తూ గుండెకాయ వంటి మనిషి ఈ పత్తేదార్.

చిన్న చిన్న చిల్లర గొడవల్లోగాని, మామూలు రౌడీ వ్యవహారాల్లోగాని కనిపించడు ఇతను. తలలు పగలగొట్టి రక్తపాతాన్ని సృష్టించే పనులమీదే బయలుదేరి బయటకు వస్తాడు.

"వెళ్ళిపోదాం సార్... పత్తేదార్ మనవంకే చూస్తున్నాడు ... బండిని వెనక్కి తిప్పండి సార్..." వెనుక వున్న కానిస్టేబుల్ మరోసారి హెచ్చరించేసరికి తన ఆలోచనల నుండి బయటపడ్డాడు శర్మ.

అతని సలహాను ఆచరణలో పెట్టటానికే నిశ్చయించుకొని బుల్లెట్‌ని వెనక్కి తిప్పుతుండగా అతనికి కనిపించిందొక దృశ్యం.

సినిమాహాలు వద్ద గొడవలు జరగబోతున్నాయని తెలియదు కాబోలు, యధాలాపంగా అటుకేసి వచ్చింది ఒక ఆటో రిక్షా.

చెప్పా పెట్టకుండా రెచ్చిపోయిన గుంపును చూడగానే ఖంగారుపడి ఒక సందు ముందుకు పోనిచ్చి క్రిందికి దూకేశాడు ఆటో డ్రయివర్. అక్కడే వుంటే తన ప్రాణాలకు ముప్పు తప్పదని అర్థం అయింది కాబోలు సందులోకి పారిపోయాడు ఆటోని అక్కడే వదిలి.

కందిరీగలు ముసురుకున్నట్లు ఆ వెహికల్‌ని కమ్ముకున్నారు రుస్తుం అనుచరులు. అందులో వున్న ప్రయాణీకులు ఇద్దర్ని మెడలు పట్టుకుని బయటికి లాగారు.

"ఖాదర్ పాషాని పోగొట్టుకున్న విచారంలో మనం మునిగివుంటే దొరబాబుల్లా ఆటోలో తిరుగుతున్నారు వీళ్ళు... తన్నండి... కాళ్ళు విరగతీయండి...." కీచుకంఠంతో గుంపులో నుంచి ఎవరో అరిచారు.

విపరీతమైన భయంతో వణికిపోతూ చేతులు జోడించారు ఆ ప్రయాణీకులు. తడబడుతున్న కంఠాలతో తమను ఏమీ చేయవద్దని ప్రార్థించారు.

"ఖాదర్ పాషా ఎవరో మాకు తెలియదు. అతను ఎందుకు పోయాడో, ఎలా పోయాడో అంతకన్నా తెలియదు, చుట్టాలను చూడటానికి పొరుగూరి నుంచి వచ్చాం. మమ్మల్ని వదిలేస్తే వెనక్కి వెళ్ళిపోతాం...." అని వేడుకున్నారు.

"మన ప్రాణంలో ప్రాణమైన ఖాదర్ పాషా ఎవరో వీళ్ళకి తెలియదట..... చూస్తారేం? తన్నండి దొంగనాయళ్ళని...."అని నోటికి వచ్చిన అసభ్య పదాలన్నిటినీ యధేచ్ఛగా ఉపయోగిస్తూ మళ్ళీ హెచ్చరించింది ఆ కీచు కంఠం.

రెండో ఆలోచన లేకుండా తన్నటం మొదలు పెట్టారు రుస్తుం అనుచరులు. ఆ ప్రయాణీకుల్ని రోడ్డుమీద పడవేసి పాదాలతో క్రూరంగా కుమ్మటం ప్రారంభించారు.

అన్నెం పున్నెం ఎరుగని ఆ అమాయక ప్రయాణీకుల ఆర్తనాదాల్ని వినటం అసాధ్యమై బుల్లెట్‌ని మళ్ళీ గుంపుకేసి తిప్పాడు సబ్ ఇన్స్‌పెక్టర్ శర్మ.

అతని ఆలోచనను అర్థం చేసుకొని అదిరిపోయాడు వెనుక వున్న కానిస్టేబుల్.

"వద్దు సార్.... దారిన పోయే గంగానమ్మను నెత్తిమీదికి తెచ్చుకోవద్దు సార్.... నా మాట వినండి సార్...." అంటూ అతని చేతిని పట్టుకొని వెనక్కి లాగటానికి ప్రయత్నించాడు.

అతని చేతుల్ని విదిలించి కొట్టాడు శర్మ. ఏం చేస్తున్నాడో తనకే తెలియని విచిత్రమైన ఉద్వేగంలో మునిగి బుల్లెట్‌ని వదిలిపేశాడు . తను విదిలించిన విదిలింపుకు వెనక్కి తూలుతున్న కానిస్టేబుల్ చేతిలో నుంచి లాఠీని లాక్కుని గుంపుకేసి పరిగెత్తాడు.

రక్తసిక్తమైపోయాయి రోడ్డుమీది ప్రయాణీకుల వదనాలు. చినిగి పీలికలైపోయాయి వారి దుస్తులు.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=1297**

* * *

**Read other books of Mr. Madhubabu @**

**http://kinige.com/kbrowse.php?via=author&id=20**